

కథ

# తత్త్వవేత్త

జి. శ్రీనివాస్ రెడ్డి



''అబ్బా! చలికి వేళ్ళు కొంకర్లు పోతున్నాయి. ఆ మర్రిచెట్టు ఇంకా ఎంత దూరం ఉందండీ?'' అంటూ విసుగ్గా అడిగింది నా శ్రీమతి.




''ఇందాకే ఆ గెస్ట్‌హౌస్ కేర్‌టేకర్ ఒక అరకిలోమీటర్ దూరంలో ఉంటుందన్నాడు కదా అమ్మా'' అంటూ ఉత్సాహంగా చెప్పాడు మా అబ్బాయి ప్రదీప్.

మా అబ్బాయికున్న ఉత్సాహానికి కారణం నేనే. ఎందుకంటే నేను మా వాడికి విష్ణుమూర్తి పాఠశాల గురించీ, అక్కడి విద్యావిధానం గురించి ఎన్నోసార్లు చెప్పాను. అలనాటి విష్ణుశర్మ మూర్ఖులైన రాజకుమారులను తన పంచతంత్ర కథల ద్వారా మేధావులుగా మార్చాడు.

''ప్రపంచ ప్రఖ్యాత తత్త్వవేత్త అయిన విష్ణుమూర్తి గారు సహజ పరిసరాల మధ్య ఒత్తిడి, సంఘర్షణ లేని విద్యావిధానం కోసం ఈ పాఠశాల స్థాపించారు. నా చిన్నతనం నుంచీ ఈ పాఠశాల గురించి విన్నాను. ఇక్కడ విద్యను కేవలం తరగతి గదులలో మాత్రమే చెప్పరు. ఇక్కడి విద్య గురుశిష్యులు కలిసి చదువుకునే ప్రక్రియగా సాగుతుంది. ఆరుబయట పెద్దవృక్షాల నీడలో అరుగుల మీద కూర్చుని కూడా చెప్పుకుంటారు. పిల్లలు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి. నిర్బంధం, ఒత్తిడులు లేని స్వేచ్ఛలో పెరగాలి. ఎవరికి ఇష్టమైన వృత్తిలో వారు జీవించాలని అనే భావాలున్న నేను మా చిన్నటౌన్‌లోనే ఒత్తిడి లేని ఒక పాఠశాలలో మావాడిని చేర్పించాను. తీరిక సమయంలో సంగీతం కూడా నేర్పించాను. ఇప్పుడు ఈ పాఠశాల ప్రవేశపరీక్ష కోసం వచ్చాం. రాత్రి పాఠశాల వారి అతిథి గృహంలోనే బసచేశాం. ఆ పాఠశాలలో పిచ్చిమొక్కలు ఉంటే వాటిని ఏరివేయరు. వాటిని ఆశ్రయించుకుని ఉండే క్రిమికీటకాల వల్ల జీవవైవిధ్యం ఉండాలనే విష్ణుమూర్తి తత్వం అది'' అంటూ ఆ పాఠశాల గురించి గొప్పగా చెప్పాను.

''ఏం తత్వమో ఏమో ఒక్క పేజీ చదివితేనే ఆవలింతలు, నిద్ర వస్తాయి. అయినా ప్రపంచమంతా ఆ సెట్టు, ఈ సెట్టు అంటూ చదివి అమెరికాలకు పోయి లక్షల డాలర్లు సంపాదించి కోట్లు పెట్టి ఆ హిల్సూ, ఈ హిల్సూ ఆ పల్లిలో ఈ పల్లిలో లక్షలు, కోట్లు పెట్టి స్థలాలు కొంటుంటే మీకీ పిచ్చేంటండీ'' అంటూ క్లాసు పీకుతున్న మా ఆవిడ నోటికి తాళం వేస్తూ.

''అదిగో మర్రిచెట్టు వచ్చేసింది'' అన్నాడు మా అబ్బాయి.

అక్కడి అరుగుల మీద అప్పటికే కొందరు తల్లిదండ్రులు వాళ్ల పిల్లల్తో కనిపించారు. వారి సరసన మేమూ కూర్చున్నాం. కొద్దిసేపట్లో ఇద్దరు వ్యక్తులు వచ్చి మా పిల్లలు పేర్లను వాళ్ల దగ్గరున్న పేపర్లలోంచి గట్టిగా చదివి వాళ్లను పరీక్ష కోసం లోపలికి తీసుకెళ్లారు. మమ్మల్నంతా ఓ గంటపాటు పాఠశాలను చూసి ఆ తర్వాత ప్రిన్సిపాల్ గారితో ఇంటర్వ్యూ కోసం వెళ్లమన్నారు. ఆ తర్వాత వచ్చి పిల్లల్ని తీసుకెళ్లమన్నారు.

''నువ్వు పాఠశాలను చూస్తూ ఉండు. అలా పాఠశాల బయటకు వెళ్ళొస్తా'' అన్న నావైపు చురచురచూస్తూ ''ఆ పనేగా అంతకంటే ఏముంటుంది. ఎన్ని తత్వాలు చదివినా ఆ పాడు సిగరెట్‌కు బానిసవేగా'' అంటూ క్లాసు పీకుతున్న మా ఆవిడను గమనించనట్టే అక్కడి నుంచి జారుకున్నాను.

పదినిముషాల తర్వాత వచ్చిన నాకు మా ఆవిడ అక్కడే మరో నలుగురు ఆడవాళ్లతో మాట్లాడుతూ కన్పించింది. ఎక్కడికి వెళ్లినా వీళ్లకు కబుర్లు తప్పవు అనుకుంటున్న నా దగ్గరికి నా శ్రీమతి తన కొత్త మిత్రురాలికి వీడ్కోలు పలికి వచ్చింది.

''ఇవి చిన్నపిల్లల తరగతి గదులు. అది ఉన్నత పాఠశాల, ఇవి నేతపని, వడ్రంగం, కుండలు తయారీ నేర్పించే గదులు. ఇది నృత్యశాల. ఇది సంగీతశాల'' అంటూ గైడ్‌లా వ్యవహరిస్తూ తరగతి గదుల్ని, ఆరుబయట జరుగుతున్న విద్యాబో

ధనలను చూసుకుంటూ ప్రిన్సిపల్ గారి గదికి చేరాం.

ఒక్కొక్క విద్యార్థి తల్లిదండ్రులను లోపలకు పిలుస్తున్నారు. మా వంతురాగానే లోపలికెళ్లాం. మేం కూర్చున్న తర్వాత వాళ్ళు ప్రశ్నలడగడం మొదలుపెట్టారు.

''మీరు ఏం చేస్తుంటారు?'' ప్రశ్నించింది ఒకావిడ. నా వ్యాపారం గురించి చెప్పాను.

''మీ వ్యాపారం పట్టణాల్లో ఇంకో రకంగా చేస్తున్నారు కదా అలా ఎందుకు చెయ్యకూడదు'' అన్నదావిడ. పట్టణాల్లోని జీవనశైలి వేరు అక్కడి మనస్తత్వాలు వేరు. వారి ఆదాయవ్యయాలు వేరేగా ఉంటాయి. టౌన్లలో ఆ పద్ధతులు ఉండవని జవాబిచ్చాను.

మా ఆవిడతో ''మీకు సంతానం ఒకరేనా?'' అని అడిగారు.

అవునని జవాబు ఇచ్చింది.

అక్కడ వారడిగిన ప్రశ్నలకు జవాబులిచ్చి ఆ తర్వాత మాకు కేటాయించిన గదికి చేరుకున్నాం. ఒక నెల తర్వాత పరీక్షా ఫలితాలు చెబుతామన్నారు. అక్కడి విశేషాల్నీ, అనుభూతులను దారంటా నెమరువేసుకుంటూ ఇల్లు చేరాం.

* * *

ఈ నెలరోజులూ భారంగా గడుస్తున్నాయి. సీటు దొరుకుతుందో లేదో అనే బెంగ ఎక్కువైంది. ఈ లోగా మా అబ్బాయికి సెలవులు వచ్చాయి. ఈలోగా ఆదుర్దా తగ్గక విష్ణుమూర్తి పాఠశాలకు ఫోన్ చేసి ఫలితాల గురించి వాకబు చేశాను. మావాడి వివరాలు కనుక్కున్న వ్యక్తి సీటు రాలేదని చల్లగా చెప్పాడు. మా అబ్బాయితో నేను చదివించిన పుస్తకాలను, ప్రాథమిక పాఠశాలలో వాడికి వచ్చిన మెరిట్ సర్టిఫికెట్లను రెండు బ్యాగుల్లో సర్ది అబ్బాయిని తీసుకుని ప్రిన్సిపల్‌ను కలవడానికి వెళ్లాను. వాటన్నింటినీ ప్రిన్సిపల్‌గారికి చూపించాను. ఎవరైనా విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలించాలంటే వారిని ఆరునెలలపాటు పరిశీలించాలన్న విష్ణుమూర్తిగారి వ్యాఖ్యను గుర్తుచేశాను. ఒక గంట పరీక్షలో విద్యార్థుల సామర్థ్యాన్ని ఎలా కొలుస్తారంటూ ప్రశ్నించాను. చిన్నటౌన్ల నుంచి వచ్చినవారికి ఇంగ్లీష్ పరిజ్ఞానం తక్కువైనంత మాత్రాన సీటు ఇవ్వకుంటే ఎలా అని వాదించాను. ఈ పాఠశాలలో చదివించాలనే నా కల గురించి చెప్పి అభ్యర్థించాను.

అన్నింటినీ భరించిన ప్రిన్సిపల్ గారు సీటు ఇవ్వడానికి ఇవ్వకపోవడానికి ఎన్నో కారణాలుంటాయి. నేను కమిటీలో ఒక సభ్యుడ్ని మాత్రమే అంటూ స్థిరంగా జవాబిచ్చారు.

ఉసూరుమంటూ తిరిగి ఇల్లు చేరాను.

సీటు రాలేదని చెప్పి మా ఆవిడకి తెలిసింది.

''మీ ఆత్రం కాకపోతే మనోడికి సీటు ఇస్తారని ఎలా అనుకున్నారండీ. మంత్రిగారి పిల్లలు, ఎమ్మెల్యేల పిల్లలూ ఇక్కడే చదువుతుంటారట. మనలాంటి బీదవాళ్ల పిల్లలకి ఎలా సీట్లు ఇస్తారు. ఇక్కడ సీటు రావాలంటే ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారంట. తత్వవేత్తలు, ఆధ్యాత్మిక పురుషులూ అంటూ

''మీ ఆత్రం కాకపోతే మనోడికి సీటు ఇస్తారని ఎలా అనుకున్నారండీ. మంత్రిగారి పిల్లలు, ఎమ్మెల్యేల పిల్లలూ ఇక్కడే చదువుతుంటారట. మనలాంటి బీదవాళ్ల పిల్లలకి ఎలా సీట్లు ఇస్తారు. ఇక్కడ సీటు రావాలంటే ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారంట. తత్వవేత్తలు, ఆధ్యాత్మిక పురుషులూ అంటూ అందరూ అందర్నీ నమ్మించేవారే. ఆ సెట్టూ, ఈ సెట్టూ అంటూ పిల్లల్నీ క్షోభ పెడుతున్నారంటూ వారి తల్లిదండ్రులను ద్వేషించే మీరు మాత్రం చేస్తున్నదేమిటి?''

అందరూ అందర్నీ నమ్మించేవారే. ఆ సెట్టూ, ఈ సెట్టూ అంటూ పిల్లల్నీ క్షోభ పెడుతున్నారంటూ వారి తల్లిదండ్రులను ద్వేషించే మీరు మాత్రం చేస్తున్నదేమిటి?'' అంటూ ఏకిపారేస్తున్న మా ఆవిడ వాగుడు వింటూ ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాను.

* * *

వేసవి సెలవులు గడుస్తున్నాయి. మా అబ్బాయిని ఎలాంటి స్కూల్లో చదివించాలని ఆలోచనలు చేస్తూనే ఉన్నాయి. టీవీలలో ప్రతి ఐదునిముషాలకో సారి ఆలిండియా టాపర్లను, సెట్లటాపర్లనూ, మట్టిలో మాణిక్యాలనూ, ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకుంటున్న వాళ్లనూ చూపిస్తూనే ఉన్నారు. పేపర్లలో ఎవరి పాఠశాల, తరగతి టాపర్ల ఫోటోలు వాళ్లు పూర్తిపేజీలో ప్రచురిస్తున్నారు. వీధి చివర్లలో అందమైన విద్యార్థుల ఫోటోలతో వినైల్ హోర్డింగ్స్ వెలిశాయి.

''అదేంటి రాజీ! పొలం గట్లపై నున్న తుమ్మచెట్లను కొనడానికి వచ్చిన రషీద్‌తో అమ్మమని చెప్పి పంపావంట'' ఎండలోనుంచి వచ్చిన నేను బట్టలు మారుస్తూ ఫ్యాన్ గాలిక్రింద సేద తీర్చుకుంటూ అడిగాను.

''అవునండీ నాకెందుకో వాటిని అమ్మకూడదనిపించింది. ఎక్కడో గాలివాటుకు కొట్టుకొచ్చిన విత్తనాలు మన పొలంలో పడ్డాయి. వాటంతటవే పెరిగాయి. మనం వాటిని పోషించిందీ లేదు, సంరక్షించిందీ లేదు. అయినా తుమ్మచెట్లంటే అంత లోకువెందుకండీ జనాలకి. నల్లగా ఉంటే తుమ్మమొద్దులా ఉన్నాడంటాం. ఎంతకీ వదలని వాళ్లను తుమ్మజిగురంటాం. తుమ్మచెట్టు నీడా ఒక నీడేనా? అంటాం. అన్నీ ఫలపుష్పాలనిచ్చే చెట్లు ఉండాలంటే ఎలా? భూమ్మీద అన్నిటికీ అందరికీ సమానంగా బ్రతికే హక్కులేదా? ఇంట్లో చక్కగా పాదు తవ్వి ఎరువు వేసి కంచె కట్టి చూసుకునే మొక్కలే చీడపీడలు తగిలి బ్రతకడం లేదు. వాటంతటవే పెరిగిన ఆ చెట్లు ఎన్నో పక్షులకు ఆవాసమైంది. జీవవైవిధ్యమో, సమతుల్యమో అంటారు కదండీ.అది ఇదేనా!'' అంటూ యథాప్రకారంగా తన వాగుడు....కాదు కాదు... అది వాగుడు కాదు, ఒక తత్వాన్ని నాకు బోధిస్తోంది. నాకిప్పుడు మా ఆవిడ విశ్వమంతా వ్యాపించిన ఓ గొప్ప తత్త్వవేత్తలా కనిపిస్తోంది. ఎక్కడో నా అంతర్నేత్రం కొద్దిగా తెరుచుకుంటున్నట్టనిపిస్తోంది.

★


పెళ్లి అనే కార్యాన్ని కార్యరూపంలో పెట్టేది "కాకతీయ" ఒక్కటే

**కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్**

103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.

ఫోన్ : 040-2374 7777, 09396 999 999



శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచి

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION

www.kaakateeya.com www.telugumarriages.com www.kannadamarriages.com www.tamilmarriages.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | (చెన్నై) టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | (చెన్నై) పోరూర్ | 093855 99077 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | (చెన్నై) తాంబరం | 093400 99993 |
| విజయవాడ | 093922 92939 | బెంగుళూరు | 093429 39345 |
| గుంటూరు | 098485 35375 | జయానగర్ | 093429 39343 |
| తెనాలి | 098480 31931 | మైసూరు | 093429 39342 |
| విశాఖపట్నం | 098481 63833 | కోయంబత్తూరు | 093457 94668 |
| రాజమండ్రి | 098485 35377 | సేలం | 093855 99066 |
| కాకినాడ | 098483 37378 | మధురై | 093603 35233 |
| ఖమ్మం | 093470 59988 | వెల్లూర్ | 093449 94400 |
| ఒంగోలు | 098487 11223 | తిరుచి | 098428 01111 |
| నెల్లూరు | 098481 97222 | పాండిచ్చేరి | 098421 27777 |
| తిరుపతి | 098485 35378 | ఈరోడ్ | 093855 99011 |
| కర్నూల్ | 093900 33815 | అనంతపూర్ | 093460 09348 |

www.kaakateeya.com